క్లుప్తంగా

నెహ్రూ విగ్రహానికి ఇదేనా గౌరవం



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఈఎల్‌ఎస్ కాలనీలోని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని పట్టించుకునేవారే కరువయ్యారు. మంగళవారం నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా పలు విద్యాసంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో నెహ్రూకు నివాళులర్పించారు. కానీ, రైల్వే కాలనీలోని ఆయన విగ్రహాన్ని ఇలా చెట్ల మధ్య వదిలేయడంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు.

దిడ్డి నరేందర్ ఇంటికి కొండా మురళి



ఖిలా వరంగల్: వరంగల్ పెరకవాడ ప్రాంత వరంగల్ మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు, జేఏసీ రైల్వేగేట్ ప్రాంత కన్వీనర్, రిటైర్డ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు కలిశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖకు మద్దతు తెలిపాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు మీసాల ప్రకాశ్ పాల్గొన్నారు.

19న క్రికెట్ మ్యాచ్‌లు

వరంగల్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువ ఓటర్లకు ఈనెల 19న క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువకులు జిల్లా యువజన సంక్షేమ అధికారిని సంప్రదించాలని కోరారు. స్థానిక ప్రజలను భాగస్వాముల్ని చేస్తూ, ఓటు ప్రాధాన్యాన్ని వివరించేందుకు ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 93470 51066 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గొర్రెకుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు సబ్ డివిజన్ పరిధి గొర్రెకుంట, ఏజీ మిల్స్, స్టేషన్ రోడ్డు, ఫోర్ట్ వరంగల్‌కు చెందిన వినియోగదారులు సదస్సులో పాల్గొని తమ సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకురావాలని ఏడీఈ జి.గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఇద్దరికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మడికొండ–ధర్మసాగర్ రోడ్డుపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన యువకుడు ధర్మసాగర్ నుంచి వస్తుండగా మరోయువకు మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనానికి సమాచారం అందించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను వివరాలు కోరగా.. ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్), స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటరు అవగాహన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ పాల్గొని మాట్లాడారు. కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఓటు హక్కు సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ నవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నాయకులు మంగళవారం ప్రచారం ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి వరంగల్ తూర్పు అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండ సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండ మురళీధర్‌రావులు ప్రచారం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినయ్ భాస్కర్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు కోరారు. హనుమకొండ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.

జవహర్‌లాల్ నెహ్రూ మహనీయుడు



హన్మకొండ:సన్ షైన్ స్కూల్‌లో..



మడికొండ: ప్రభుత్వ పాఠశాలలో వివిధ వేషధారణలతో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

చాచా నెహ్రూగా పేరుగాంచిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం విద్యాసంస్థల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను ఈసందర్భంగా ఉపాధ్యాయులు తదితరులు చిన్నారులకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖిలా వరంగల్: ఏకశిల డిజి స్కూల్‌లో..



నయీంనగర్‌లోని తేజస్వీ స్కూల్‌లో..



వరంగల్ చౌరస్తా: నివాళులర్పిస్తున్న ప్రకాశ్ రావు



కరీమాబాద్ : తాళ్లపద్మావతి పాఠశాలలో..



కాజీపేట రూరల్: ఆపిల్ ప్లే స్కూల్‌లో ..

క్యూఆర్ కోడ్ పై అవగాహన సదస్సు

హన్మకొండ అర్బన్ : క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఏ విధంగా ఈ- రిసోర్స్, వెబ్ సైట్స్, ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్ ఓపెన్ చేసుకోవాలనే అంశంపై పింగిళి కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి జగదీష్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో జగదీష్ మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని విభాగాల్లో ఈ క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్నారని, దీనికి కళాశాల, ఆర్గనైజేషన్‌కి సంబంధించిన లోగోస్‌ని యాడ్ చేస్తే మనకి అవసరమైన క్యూఆర్ కోడ్‌ను సులభంగా జనరేట్ చేసుకోవచ్చని సూచించారు. జాతీయ గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పేర్కొన్నారు. కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ సుహాసిని, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కల్పన పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ఆర్ తోట, దేశాయిపేట ప్రాంతాల్లో ఓటు ప్రయోజనాలు, ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్‌లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ రాజేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఓటు నిర్ధారణ వంటి అంశాలపై స్థానిక ఓటర్లకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, సిబ్బంది చే అధికారులు ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని, సరైన నాయకున్ని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీఓలు సునీత, రమ ఆర్పీలు స్వరూప, లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు 'స్వీప్' అవగాహన సదస్సు

కాశీబుగ్గ సెంటర్: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం స్వీప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటరు చైతన్యం, మాక్ పోలింగ్, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ తదితర అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు హక్కు వినియోగంపై స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీఈఓ వాసంతి పర్యవేక్షణలో అవగాహన కల్పించారు.

ప్రజాస్వామ్యానికి ఓటు ఆయువుపట్టు

హన్మకొండ అర్బన్: ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు ఓటు అని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల అన్నారు. మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓటు హక్కు వినియోగంపై దివ్యాంగులు, వయో వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, నోడల్ అధికారి హరిప్రసాద్, సహాయ నోడల్ అధికారి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ఎన్నికల ఓటు ఐకాన్ ఓరుగంటి లైలా, డీసీపీఓ పి.సంతోశ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

మధుమేహంపై అవగాహన అవసరం



నయీంనగర్ : మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



కాజీపేట: వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై..

నయీంనగర్ : మధుమేహ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ డయాబెటిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రధాన కూడళ్లు గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు, ఎర్రగట్టుగుట్ట, కేయూ క్రాస్ రోడ్, వడ్డెపల్లి చర్చి కాంపౌండ్, ఎంజీఎం సర్కిల్‌లో తెలంగాణ డయాబెటిస్ అసోయేషన్ అధ్వర్యంలో మధుమేహ స్కీనింగ్ అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు, కార్యదర్శి డాక్టర్ కుంభం సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. అందరూ మధుమేహ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, మధుమేహ వ్యాధిగ్రస్తులు కొన్ని జాగ్రత్తలతో సామాన్య జీవితాన్ని గడవచ్చని అన్నారు. 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, శివ సుబ్రహ్మణ్యం, బత్తుల శ్రీధర్, జి.చంద్రశేఖర్, పవన్‌కుమార్, గంజి ప్రవీణ్‌కుమార్, శ్రవణ్ అంకాతి, రఘుపతి, ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ శివారులోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం ఆవరణలో మంగళవారం డయాబెటిస్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ రఘుపతి ఓరుగంటి పర్యవేక్షణలో దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లెపల్లి రాజేష్, నాగపురి సారయ్య, మేజిషియన్ శ్రీనివాస్ రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై కార్తీక మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మడికొండ: మడికొండలోని మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారికి ప్రభాత సేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారధన, ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రామలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం హరి హరులకు అత్యంత వైభవంగా ఆకాశదీపోత్సవం శివాలయంలో ప్రదోష కాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హరతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషు భారతి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణశర్మ, విష్ణువర్ధనాచార్యులు పాల్గొన్నారు.

సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్లో సైన్స్ ఫెయిర్



నాటక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: బాలల దినోత్సవంతోపాటు గ్యాబ్రియల్స్ స్కూల్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నేపథ్యంలో కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్లో మంగళవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించినట్లు తెలిపారు. చదువుకునే సమయంలో సైన్స ఫెయిర్‌లో పాల్గొనడం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని తెలిపా రు. ప్రతి విద్యార్థి కాలానికి అనుగుణంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు జి.రమాదేవి, సలేహా, జుబేద, విద్యార్థులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల ఆంధ్రప్రదేశ్ గన్నవరంలో జరిగిన మాలిక్యుల్ ఫెస్ట్ సాహిత్య, సాంస్కృతిక విభాగం పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోని బహుమతులు ప్రదానం చేశారు. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీ త్రినగర పాఠశాలల విజేతలకు బ్రదర్ ఆంటోని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రదర్ స్లీవారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరూరి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం



వర్ధన్నపేట: తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సారంగపాణి కుటుంబీకులు



మామునూరు: ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేష్ మూడోసారి గెలిపించడానికి మంగళవారం మండలంలోని పలు గ్రామాలతో పాటు పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 10వ డివిజన్ తుమ్మల రవీందర్, 11వ డివిజన్‌లో కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కోదాటి దేవేందర్‌రావుతో పాటు కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

తిరుమల వెంకన్నకు ప్రత్యేక పూజలు

పట్టణ కౌన్సిలర్ పాలకుర్తి సుజాత, మాజీ జెడ్పీటీసీ సారంగపాణి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అరూరి భారీ మెజారిటీతో గెలుపొందాలని స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారి కల్యాణం జరిపించారు.

44వ డివిజన్‌లో ప్రచారం..

మామునూరు: గ్రేటర్ పరిధి ఖిలా వరంగల్ మండలం 44వ డివిజన్‌లోని అల్లీపురం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోతుగంటి రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటి వెళ్లి కరపత్రాన్ని అందజేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ముప్ప సతీష్, శీలం సాంబయ్య, లక్కరాజు, అమరవాది ఉదయ్‌కుమార్, సింగారం చిరంజీవి, బండి మోహన్‌బాబు, రాజేష్, ఎండీ.షకీల్, శీలం సాంబశివుడు,కట్కూరి అరుణ, బైరి యశోద, రజిత, సరోజన, లక్ష్మీ, పోతుగంటి రజిత, రూపవతి, వెంకటమ్మ, బుజ్జక్క తదితరులు పాల్గొన్నారు



వర్ధన్నపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మేరు సంఘం కమిటీ ఎన్నిక

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని ఓ హోటల్‌లో హనుమకొండ జిల్లా మేరు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు తాళ్ల సంపత్‌కుమార్ జిల్లా ఎన్నికల అధికారి పెండ్యాల హరిప్రసాద్ ప్రకటించారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా తాళ్ల దయానంద్, ప్రధాన కార్యదర్శిగా పాడిశెట్టి గణేష్, కోశాధికారిగా కొట్టురు భిక్షపతి, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి గోపి, రాపర్తి శ్రీనివాస్, గూడూరు సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గూడూరు సతీష్‌కుమార్ మాట్లాడారు. మేరు కులస్తులు టైలర్ వృత్తిపైన ఆధారపడి బీదరికంలో జీవిస్తున్నారని, 50 ఏళ్లు నిండిన మేరు కులస్తులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో మేరులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కర్నె రవీందర్, గూడూరు బాలాజీ, నన్నె లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆరు మద్యం బాటిళ్లు ఉండొచ్చు

కాజీపేట: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది బెల్ట్ షాపులను మూసివేయించారు. ఈక్రమంలో మద్యం ప్రియులు ఎన్ని బాటిళ్లతో ప్రయాణం చేయవచ్చు.. ఇంట్లో ఎన్ని సీసాలను నిల్వ ఉంచుకోవచ్చనే విషయంలో అనుమానాలు ఉన్నాయి. అయితే ఎన్నికల కోడ్‌తోపాటు సాధారణ సమయాల్లోనూ ఒక వ్యక్తి 6 మద్యం ఫుల్ బాటిళ్లు, 12 బీర్లు తీసుకెళ్లవచ్చని నిబంధనలు చెబుతున్నాయి. అంతకు మించి మద్యం బాటిల్స్‌తో పట్టుబడితే సీజ్ చేసి కేసు నమోదు చేస్తారు. ఇక.. బెల్ట్ షాపుల్లో మద్యం ఎంత దొరికిన సీజ్ చేస్తారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణషాపు దగ్ధం



వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలో మంగళవారం జరిగిన విద్యుతాఘాతంతో భవానీ కిరాణ షాపు దగ్ధం అయింది. షాపు యజమాని పత్రి వెంకట్రాజ్యం మూడు కూతురు వివాహం రోజుల క్రితం జరిగింది. కూతురుకు సంబంధించిన రూ.5,80,000 నగదు, బంగారంతోపాటు సుమారు రూ.2లక్షల విలువైన కిరాణం సామాగ్రి ఈప్రమాదంలో కాలి బూడిద అయిందని బాధితుడు రోధిస్తూ తెలిపాడు కిరాణ షాప్ కాలిపోవడంతో వెంకట్రాజ్యం కుటుంబానికి దిక్కులేకుండా పోయిందని, ప్రభుత్వం సాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. గొర్రెకుంట స్టేషన్ నుంచి ఫైరింజన్ వెళ్లి మంటలను అదుపుచేసిందని వరంగల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి పర్వతగిరి జెడ్పీటీసీ దంపతులు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు భారీషాక్ తగిలింది. స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, పర్వతగిరి జెడ్పీటీసీ సభ్యుడు బానోతు సింగులాల్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పనలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మామునూర్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని సింగులాల్, కల్పనలు పేర్కొన్నారు. ఇటీవల పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌తోపాటు మరికొంతమంది కాంగ్రెస్ బాట పట్టారు.

ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట పట్టణంలో కొలువు దీరిన స్వయంభు శ్రీశ్వేతార్క మూల గణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం కార్తీక మాస ఉత్సవాల ఆహ్వాన పత్రికలను భక్తులు మంగళవారం ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

1) The Open Land, admeasuring 300.00 sq. yards in Sy. No. 512/1, Plot No. 162, in Bheemaram (V), Hasanparthy (M), Hanamukakonda, Dist. Plot No. 163, Plot No. 161, 30'ft Road, Plot No. 175.

2) The Open Land, admeasuring 300.00 sq. yards in Sy. No. 513/1, Plot No. 296, in Bheemaram (V), Hasanparthy (M), Hanumakonda (Dist.) 30' ft's Road, Plot No. 297, 30'ft Road, Plot No. 295.

Sd/- A. KIRAN SINGH, B.A., LL.B, Advocate

24-7-210/1, Pragathi Nagar Colony, Phase-II, Near N.I.T. Kazipet, Cell: 9908940605

Dt: 14-11-2023

పత్తి ధర తగ్గించడంతో రైతులకు నష్టం

వరంగల్: వరంగల్ మార్కెట్‌లో వ్యాపారుల సిండికేట్‌గా ఏర్పడి పత్తి ధర తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్(ఏఐకేఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు ఆరోపించారు.ఈ మేరకు మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పత్తి యార్డును సందర్శించి మాట్లాడారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,930 కొనుగోలు చేస్తుండగా వరంగల్‌లో రూ.6775 కొనుగోలు చేస్తున్నారన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులు మద్దతు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాషిపాక రమేష్, గోనె కుమారస్వామి, కూస సంపత్‌కుమార్, శంకర్‌రావు, గోపాల్, ఆనందరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.